క్లుప్తంగా

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడ సామగ్రిని అందిస్తున్న హెచ్‌ఎం విశ్వనాథ్

మడకశిరరూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని హెచ్‌ఎం విశ్వనాథ్ సూచించారు. దాతల సహకారంతో మంగళవారం పాఠశాలకు రూ.15 వేల విలువ చేసే క్రీడ సామాగ్రిని ఉపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు పెరియార్ రామస్వామి



రామస్వామి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న బీఎస్పీనాయకులు

హిందూపురం: సామాజిక విప్లవకారుడు పెరియార్ రామస్వామి అని బీఎస్పీ నాయకులు పేర్కొన్నారు. బీఎస్పీ నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో పెరియార్ ఈవీ రామస్వామి నాయకర్ 145వ జయంతిని చౌళూరు రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. రామస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ దేశంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పెరియార్ రామస్వామి నాయకర్ జీవితాంతం పోరాడారన్నారు. దేశంలో నాస్తికత్వాన్ని బలంగా నమ్మి మహిళలకు విద్య, స్వేచ్ఛ, సమానత్వ హక్కుల కోసం ఆత్మ గౌరవ పోరాటాలు చేసిన మహనీయులన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఐక్యంగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ట్రెజరర్ హరికుమార్, నాయకులు సుబ్బరాయప్ప, ఈశ్వరయ్య,నారాయణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కరించండి



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: నియోజకవర్గంలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు. రెండు నెలల్లో 60 బోర్లను వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. శ్రీరామరెడ్డి పథకం ద్వారా 25 రోజుల నుంచి తాగునీరు అందడం లేదని, సంబంధిత కాంట్రాక్టర్ కార్మికులను వేతనాలు చెల్లించాలన్నారు. జేజేఎం పనులకు టెండర్లు పిలిచి పూర్తి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈలు సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని పోలీసు అధికారులతో సమావేశమై ఎక్కడా జూదాలు జరగకుండా చూడాలన్నారు. తర్వాత పావగడ రోడ్డులోని కాలనీలో ప్రభుత్వం నిర్మించిన నూతన గృహాలను ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత యాదవ కల్యాణ మండపంలో వ్యవసాయం, హార్టికల్చర్, సెరికల్చర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

సోమందేపల్లి: పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు ఓంకార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎస్‌ఓ అనీత, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

'లింగదహళ్లిని గుండెలో పెట్టుకుని చూసుకుంటా'



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: తన గెలుపునకు మూల కారణమైన లింగదహళ్లి గ్రామాన్ని గుండెలో పెట్టుకుని చూసుకుంటానని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ పేర్కొన్నారు. లింగదహళ్లి మంగళవారం ఆయన రూ.కోట్ల అంచనాతో తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేర్చామన్నారు. త్వరలోనే తుంగభద్ర తాగు నీరు, రైల్వేలైన్, రింగ్ రోడ్డు నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సణ్ణ రామరెడ్డి, వేణుగోపాలరెడ్డి, మదన్ రెడ్డి, హనుమేశ్, దివాకర్, పాపణ్ణ, చంద్రశేఖరరెడ్డి, మారణ్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల పనులు ఆపొద్దు

"పెనుకొండతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న మెడికల్ కళాశాల పనులను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేయరాదు. ఎంతో మంది పేద విద్యార్థులు వైద్య విద్య చదవాలని కలలు గంటున్నారు. వైద్య విద్య ఖరీదు కావడంతో ఇప్పటికే చాలా మంది విదేశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఇలాంటి నేపథ్యంలో గత ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో ఐదింటిని పూర్తి చేసింది. మరో ఐదింటిని ఈ ఏడాది అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని పూర్తి చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలి. వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే పేద విద్యార్థులతోపాటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు."

– నాగరాజు, న్యాయవాది, పెనుకొండ





సాకులతో వైద్య వ్యవస్థను దెబ్బతీయొద్దు

ఏవేవో సాకులను చూపి వైద్య వ్యవస్థను దెబ్బతీయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నింది. ఇది చాలా దారుణం. గత ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందజేయాలనే ఉద్దేశంతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం వైద్య రంగం కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలో 50 ఏళ్ల తర్వాత గత ప్రభుత్వం ఒకేసారి 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వాటిలో ఇప్పటికే 5 కళాశాలలు పని చేస్తున్నాయి. జగనన్న అధికారంలో వచ్చి ఉంటే ఈ ఏడాది మరో 5 కళాశాలలు అందుబాటులోకి వచ్చేవి. ఈ ప్రభుత్వం ప్రైవేటు మోజుతో వైద్య రంగాన్ని ప్రజలకు దూరం చేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటు జపం మాని వైద్య కళాశాలలను అందుబాటులోకి తేవాలి."

– పొగాకు రామచంద్ర, వాల్మీకి, బోయ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పెనుకొండ

పడకేసిన పాలన!

- ప్రధాన శాఖలకు రెగ్యులర్ అధికారుల కరువు
- రెగ్యులర్ తహసీల్దార్లు లేక ప్రజల ఇబ్బందులు
- డ్వామాకు రెగ్యులర్ ఏపీడీ లేక కూలీలకు తప్పని వలసలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

మడకశిర: రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక జిల్లాలోనే అత్యంత వెనుకబడిన మడకశిర నియోజకవర్గంలో పాలన పడకేసింది. ప్రధాన శాఖలకు రెగ్యులర్ అధికారులు కరువయ్యారు. ఇన్‌చార్జ్‌తోనే పాలన సాగిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి ఇన్‌చార్జ్ అధికారుల వద్దకు వెళితే రెగ్యులర్ అధికారులు వచ్చాక మీ పనులను చేయించుకోండని ఉచిత సలహాలు ఇచ్చి పంపిస్తున్నారు. రెగ్యులర్ అధికారులు లేక పోవడంతో నియోజకవర్గంలో అభివృద్ధి ఆగిపోయింది. ఇంత జరుగుతున్నా స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

పంచాయతీరాజ్ శాఖలో ఒకే ఒక్కడు

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పంచాయతీ రాజ్‌శాఖ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే అలాంటి ప్రాధాన్యత కలిగిన ఈశాఖ నిర్వీర్యంగా మారింది. ఈశాఖ పరిధిలోనే జగన్ హయాంలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేపట్టారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఈపనులన్నీ ఆగిపోయాయి. ఈశాఖలో 5 మండలాలకు ఐదుగురు రెగ్యులర్ మండల ఇంజినీర్లు ఉండాల్సి ఉండగా.... ప్రస్తుతం ఒకరే రెగ్యులర్ ఇంజనీర్ ఉన్నారు. ఇక పీఆర్ ప్రాజెక్ట్ డీఈనే పీఆర్‌కు కూడా ఇన్‌చార్జ్ డీఈగా కొనసాగుతున్నారు.

రెవెన్యూశాఖ నిర్వీర్యం

నియోజకవర్గంలో రెవెన్యూశాఖ నిర్వీర్యంగా మారింది. ఐదు మండలాలకు గాను నాలుగు మండలాలకు రెగ్యులర్ తహసీల్దార్లు లేరు. దీంతో ప్రజలు రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. మాకెందుకులే అని ఇన్‌చార్జ్ తహసీల్దార్లు ప్రజల రెవెన్యూ సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారు. ఇక ఎంతో ప్రాధాన్యత కలిగిన డ్వామాకు కూడా రెగ్యులర్ ఏపీడీ లేరు. దీంతో ఈశాఖ పరిధిలో ఆశించిన స్థాయిలో ఉపాధి పనులు జరగడం లేదని అంటున్నారు. కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడంలో విఫలమవుతున్నారు.దీంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు.పండ్ల తోటల పెంపకంలో కూడా లక్ష్యం సాధించలేక పోతున్నారు.

రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేక నానా తంటాలు

నియోజకవర్గానికంతా కలిపి ఒకే ఒక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మడకశిరలో ఉంది. అయితే రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేకపోవడం ప్రజలకు శాపంగా మారింది. ప్రజల తమ ఆస్తుల క్రయ విక్రయాలకు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఇలా నియోజకవర్గంలో ప్రధాన శాఖలకు రెగ్యులర్ అధికారులు లేక పోవడం అభివృద్ధికి ఆటంకంగా మారింది. మరోవైపు నియోజకవర్గంలోని పలు పంచాయతీలకు గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించి పాలన సజావుగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.



మడకశిరలోని పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం

మడకశిరలో ఆగిన అభివృద్ధి



కూటమి ప్రభుత్వం వచ్చాక మడకశిరలో అభివృద్ధి పూర్తిగా అగింది. ప్రధాన శాఖలకు రెగ్యులర్ అధికారులు లేకపోవడమే ఇందుకు కారణం. వైఎస్‌జగన్ హయాంలో మంజూరైన సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌ల భవనాల పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. ఇన్‌చార్జ్ అధికారులతో ప్రజల పనులు కావడంలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించడంతో పాటు ఆగిన అభివృద్ధి పనులను ప్రారంభించాలి.

–ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త

కష్టపడితేనే ఉన్నత స్థానాలకు చేరుకోగలం



మాట్లాడుతున్న న్యాయమూర్తి దుర్గాప్రసాద్

హిందూపురం: కష్టపడి చదివితేనే ఉన్నతస్థానాలకు చేరుకోగలమని తెలంగాణకు చెందిన జిల్లా న్యాయమూర్తి దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్‌డీఎస్ కళాశాలలో జరిగిన లీగల్ అవేర్నెస్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి న్యాయమూర్తి దుర్గాప్రసాద్, సీఐ రాజగోపాల్ హాజరై మాట్లాడారు. స్వశక్తితో కష్టపడితే తప్పక విజయం సాధించవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు చంద్రమోహన్, ప్రిన్సిపాళ్లు ప్రసాద్, నాగేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు రాజన్న ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

పరిగి(రొద్దం): రొద్దం మండలం రెడ్డిపల్లిలో దళిత బాలికపై జరిగిన హత్యాచార ఘటనలో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు. గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న దళిత బాలికను అదే గ్రామానికి చెందిన కార్తీక్ అనే వ్యక్తి లైంగికంగా వేధించడంతో పాటూ అత్యాచారం చేసిన ఉదంతం సోమవారం వెలుగుచూసింది. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

మడకశిరరూరల్: ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ సాధ్యామని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా మంగళవారం కల్లుమర్రి ప్రాథమిక సిబ్బంది పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, విద్యార్థులకు నులిపురుగు మాత్రలను వేశారు.

రొళ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నులి పురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. రత్నగిరి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం హరిప్రసాద్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ సుదర్శన్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు.

అగళి: ఆర్జీపల్లి, కొమరేపల్లి పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం డాక్టర్ శివానంద్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మడకశిర మండలం కల్లుమర్రిలో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు మంగళవారం అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఒకటిన్నర సంవత్సరం నుంచి 18 ఏళ్లో లోపు వారికి మందులు వేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ ఉమాపతి, స్టాఫ్ నర్సు జ్యోతిర్లింగం తెలిపారు.

సోమందేపల్లి: ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగల నివారణ సాధ్యమని వైద్యుడు ఓంకార్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు

హిందూపురం: పట్టణంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం బీజేపీ నాయకులు స్థానిక సూగురు ఆంజనేయ స్వామి దేవాలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బీజేపీ పట్టణ అధ్యక్షుడు నగేష్ బాబు ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, పలాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మేడం వరప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్ కుమార్, శంకర్, భాగ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ, అశోక్ కుమార్, అసెంబ్లీ కో కన్వీనర్ వెంకట శివప్ప, ప్రధాన కార్యదర్శి అర్జున్ నాయక్, ఉపాధ్యక్షుడు రవి, సత్యనారాయణ, లక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: పీఎం నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో బీజేపీ నేత పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అన్నదానం నిర్వహించారు. మండల కన్వీనర్ బంగారు చంద్ర, గోవిందరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈసందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. గాయత్రిదేవి ఆలయంలో ప్రధాని పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, మడకశిర బీజేపీ కన్వీనర్ హనుమంతప్ప, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'లీన్'పై అవగాహన

పెనుకొండ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన లీన్ కార్యక్రమంపై కియా అనుబంధ పరిశ్రమ మోబిస్ పరిశ్రమలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నేషనల్ ప్రొడెక్టివిటీ కౌన్సిల్ డిప్యూటీడైరెక్టర్ సంజన్న మాట్లాడారు. ఎంఎస్‌ఎంఈల పని సామర్థ్యం పెంచి ఉత్పాదకతను మెరుగుపరచి, వ్యర్థాలను తగ్గించేందుకే లీన్ కార్యక్రమం ప్రారంభించామన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్ బాషా, కియా పరిశ్రమ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

మడకశిర: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని ఆర్టీసీ డీఎం రామసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలను ప్రారంభించారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలో పంచాయతీరాజ్ శాఖ, వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్, ఉపాధి హామీ సిబ్బంది మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని సీహెచ్‌సీ ఆసుపత్రి ఆవరణం నుంచి గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ ఆవరణలోని వైఎస్సార్ సర్కిల్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ అజాద్, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏపీఓ ఓబుళప్ప, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, కార్యదర్శులు శ్రీనాథ్, రచన, ఆరోగ్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ రామారావు,ఎంపీటీసీ సభ్యుడు శశిధర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అగళి: పట్టణంలో వివిధ శాఖల సిబ్బంది మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం పై అవగాహన ర్యాలీ చేపట్టారు. అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీగా బస్టాండ్ వద్దకు చేరుకుని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ రవిప్రసాద్, ఈఓఆర్డీ పద్మ, పంచాయతీ కార్యదర్శులు రంగనాథ్, ఆశోక్ పాల్గొన్నారు.



అగళిలో మానవహారంగా ఏర్పడిన దృశ్యం

గోరంట్ల: పట్టణంలో మంగళవారం ఎంపీడీఓ రఘునాథగుప్త ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు.

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని సర్పంచ్ రంగనాథ్ కోరారు. మెళవాయిలో మంగళవారం కార్మికులు, వైద్య సిబ్బంది, ఉద్యోగులు స్వచ్ఛతా హీ సేవాపై ర్యాలీ నిర్వహించారు.

చిలమత్తూరు: స్వచ్ఛతా హీసేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 12 గ్రామ పంచాయతీ కేంద్రాల్లో విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ నరేష్ కృష్ణ, ఈఓఆర్డీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని అన్ని పంచాయతీల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవపై అధికారులు, ప్రజా ప్రతినిధులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు

లేపాక్షి: మండల వ్యాప్తంగా అన్ని పంచాయితీల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. ఈఓఆర్డీ శివన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సరస్వతి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

హిందూపురం: స్వచ్ఛ హిందూపురం కోసం కృషి చేద్దామని మున్సిపల్ ఎంఈ విశ్వనాథ్ అన్నారు. మున్సిపల్ ఆఫీసులో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మంగళవారం మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఆఫీసు నుంచి బైపాస్‌రోడ్డు మీదుగా ఎంజీఎం హైస్కూల్ వరకు ర్యాలీ సాగింది.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయండి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం రత్నగిరి, హొట్టేబెట్ట, బీజీహళ్లి ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. రత్నగిరిలో జరిగిన సమావేశానికి ఎంఈఓ శ్రీధర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలన్నారు.

అగళి: విద్యార్థులకు అర్థమయ్యేలా రీతిలో బోధించాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.

తిమ్మక్క మృతిపై కేసు నమోదు

రొళ్ల: కాకి ఎస్సీ కాలనీకి చెందిన తిమ్మక్క (60) అనే వృద్ధురాలు సోమవారం ఉదయం చెరువులో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతురాలి కుమార్తె జయమ్మ పిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

తూకాల్లో తేడా వస్తే చర్యలు

సోమందేపల్లి: తూకాల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ అధికారి శివ శంకర్ వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. విషయం తెలుసుకున్న వ్యాపారస్తులు తమ షాపులు బంద్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా తూకాల్లో మోసాలకు పాల్పడితే 7989005014కు సమాచారం అందించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మదేవికి హారతులు

అమరాపురం: కెంకెర, గుణేహళ్లి, బసవనపల్లి గ్రామాల్లో మంగళవారం మారెమ్మ ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇంటి నుంచి పిండితో తయారు చేసిన కలశాలను ఏర్పాటు చేసుకుని గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా ఆయా గ్రామాల్లోని ఆలయాలకు చేరుకున్నారు. అక్కడ ఆలయం చుట్టు ప్రదక్షిణ అనంతరం హారతులను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులు తెచ్చిన వివిధ పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మారెమ్మ జాతర కావడంతో స్నేహితులు, బంధువులతో గ్రామాలు కిక్కిరిసి పోయాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు.





ఊరేగింపులో భారీ గణనాథుడు, గణనాథునికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే డా.తిప్పేస్వామి



నిమజ్జనంలో కేరింతలు కొడుతున్న మహిళలు



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనోత్సవం

మడకశిర: పట్టణంలో మంగళవారం రాత్రి వినాయక నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. డీజే హోరు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య శోభయాత్ర సాగింది. తొలుత గణేష్ విగ్రహాలన్ని పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకున్నాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ ముందుకుసాగారు. ఆ తర్వాత గణనాథులను గంగవడికి చేర్చారు. పట్టణ సమీపంలోని చెరువులో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. సీఐలు రాజ్ కుమార్, రామారావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుడిబండ: ఫళారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. గణనాథుని విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. డీజే సౌండ్స్‌తో యువకులు నృత్యం చేస్తూ రంగులు చల్లుకుంటూ ముందుగా సాగారు. అనంతరం గుడిబండ చెరువు వెనక భాగంలో ఉన్న వ్యయసాయ బావిలో విగ్రహాన్ని నిమజనం చేశారు.